



వేతనాల కోసం ఎదురుచూపులు

సక్రమంగా జీతాలు రాక గ్రామ డాక్ సేవకుల ఇబ్బందులు

● పట్టించుకోని అధికారులు

భగత్‌నగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): భారతీయ తపాల శాఖలో గ్రామీణ డాక్ సేవకులకు వేతనాలు రాక తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గ్రామీణ డాక్ సేవకులు వందల సంఖ్యలో పనిచేస్తున్నారు. వీరు గ్రామీణ డాక్ సేవకులు సబ్ పోస్టాఫీసుల నుంచి ఉత్తరాలు, పార్సిల్సు, మనీఆర్డర్లు, మెగజైన్‌లు, స్టేషనరీలను బట్వాడా చేస్తుంటారు. వీరికి నెలకు 14 వేల రూపాయలు అందించాల్సి ఉంది. ఒక్కో గ్రామీణడాక్ సేవకుడికి నాలుగు నెలల నుంచి సంవత్సరానికిపైగా కొంత మందికి రెండు సంవత్సరాల నుంచి వేతనాలు రావడం లేదని వాపోతున్నారు.

● రోజు వారీ ఖర్చులు

నిత్యం సబ్ పోస్టాఫీసుల నుంచి ఉత్తరాలను బట్వాడాచేయడానికి ద్విచక్ర వాహనాల్లో వంద నుంచి రెండు వందల వరకు పెట్రోల్‌కు ఖర్చు అవుతుందని డాక్ సేవకులు అంటున్నారు. అప్పుల పాలై ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా విధులు నిర్వహిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోస్టల్ సూపరిండెంట్, పోస్టు మాస్టర్ జనరల్ దృష్టికి తీసుకు వెళ్లినా తమ సమస్యలుపరి ష్కారంకావడం లేదని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా తమకు రావాల్సిన వేతనాలు అందించి ఆదుకోవాలని గ్రామీణ డాక్ సేవకులు వేడుకుంటున్నారు.

తపాలా పనులన్నీ చక్క బెడుతున్నా అధికారులు పట్టించు కోవడం లేదు. జిల్లాలో సబ్‌స్టిట్యూట్ డాక్ సేవకుల పరిస్థితి మరీ అధ్వానంగా తయారైంది. వారి ఏళ్లుగా జీతాలు అందడ లేదు.

అధికారులు పట్టించుకోవడం లేదు..



- బొల్లం నిఖిల్, మానకొండూర్

వేతనాల ఇప్పించాలని అధికారులను వేడుకుంటున్నా పట్టించుకోవడం లేదు. రెండు సంవత్సరాలుగా మానకొండూర్‌లో స్టాఫ్ గ్యాప్ పోస్ట్‌మాకచన్‌గా విధులు నిర్వహిస్తున్నా వేతనాలు మాత్రం రావడంలేదు. తపాల శాఖ జాతీయ సంస్థ అయినందున కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ జోక్యం తీసుకుని వేతనాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలి.

పెట్రోల్ ఖర్చులకు అప్పులు చేస్తున్నాం

- యూర గిరిప్రసాద్



నిత్యం ఉత్తరాల బట్వాడా కోసం పెట్రోల్ ఖర్చుల కోసం అప్పులు చేస్తున్నాం. తక్కువ జీతాలు ఉన్నా సర్దుకుపోయి పని చేస్తున్నాం. అవీ సక్రమంగా ఇవ్వకపోవడంతో కుటుంబపోషణ భారంగా మారింది. జీతాలు లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి మా సమస్యకు పరిష్కారం చూపించాలి.

గ్రంథాలయాలు విజ్ఞాన వికాస కేంద్రాలు

- అడిషనల్ కలెక్టర్ ప్రపుల్ దేశాయ్
- వారోత్సవాలు ప్రారంభం



కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రపుల్‌దేశాయ్

కరీంనగర్ కల్చరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు వ్యక్తిత్వ, విజ్ఞాన వికాస కేంద్రాలని అడిషనల్ కలెక్టర్ ప్రపుల్ దేశాయ్ అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులే దేశ భవిష్యత్తు అని నెహ్రూ చెప్పారని, వారితో దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. పుస్తకాలు శారీరక, మానసిక వికాసం కోసం ఉపయోగపడుతాయని, గ్రంథాలయాలకు వెళ్ళే అలవాటు చేసుకోవాలని అన్నారు. ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్ మాట్లాడుతూ కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అన్నారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం మాట్లాడుతూ బాలలే నవ భారత నిర్మా తలన్న నెహ్రూ కలలను నిజం చేయాలన్నారు. గ్రంథాలయ అభివృద్ధికి పూర్తి స్థాయి బాధ్యత తీసుకుంటానని అన్నారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖన, మెమోరీ గేమ్ అండ్ గేమ్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిం చారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎ సరిత, సిబ్బంది జి సరిత, కె మల్ల య్య, జె గౌతమి, రాజమల్లయ్య, పద్మావతి, నాగభూషణం, మహేశ్ పాల్గొన్నారు.

రూ.2 కోట్లతో బాలసదన్ భవనం

- బాలల భవిష్యత్, వారి రక్షణే ధ్యేయం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్



బాల సదన్ నూతన భవనానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బాల సదన్ భవనం శిథిలావస్థకు చేరు కున్నం దున రెండు కోట్ల రూపాయలతో నూతన భవనాన్ని నిర్మిస్తున్నా మని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తెలిపారు. క్రిస్టియన్ కాలనీలోని బాల సదనం భవనం ఆవరణలో స్మార్ట్‌సిటీ నిధులతో చేపట్టనున్న బాలసదన భవన నిర్మాణ పనులకు ఆయన గురువారం భూమిపూజ చేశారు. నూతన భవన నిర్మాణ డీఆర్, డిజైన్ మ్యాప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కమలాకర్ మాట్లాడుతూ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని చిన్నారులకు శుభాకాంక్షలు తెలిపారు. పిల్లలను దైవ సమానులుగా భావించాలని అన్నారు. బాలల భవిష్యత్, వారి రక్షణే తమ ధ్యేయమన్నారు. తాను మంత్రిగా ఉన్నప్పుడే నూతన భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు ఆలస్యమయ్యాయని తెలిపారు. బాలల దినోత్సవం సందర్భంగా బాల సదన్ భవన నిర్మాణానికి భూమి పూజ చేయడం సంతోషంగా ఉందన్నారు. భవన నిర్మాణ పనులను ఆరు నెలల్లో పూర్తచేసి అందుబాటులోకి తేవాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, కమిషనర్ చాహత్ బాజ్‌పాయి, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి హరిశంకర్, కార్పొరేటర్లు మేచినేని వనజ అశోక్‌రావు, జంగిలి ఐలేందర్‌యాదవ్, బోనాల శ్రీకాంత్, వాల రమణారావు, కోల మాలతి సంపత్‌కుమార్, ఈఈ సుబ్రహ్మణ్యం, డీఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు గురునానక్ జయంతి



పూలతో అలంకరించిన కరీంనగర్‌లోని గురుద్వారా

కరీంనగర్ కల్చరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గురునానక్ దేవ్‌జీ మహరాజ్ జయంతిని శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. గురునానక్ సిద్ధాంతాలే సిక్కు మత స్థాపనకు దారితీశాయి. అన్ని మతాల వారు కలిసి ఉండాలని చెబుతూ కొత్త సూత్రాలకు రూపమిచ్చారు. గురునానక్ బోధనలన్నింటిని కలిపి పొందుపరిచిన ఆదిగ్రంథ్ సిక్కు మతస్తులకు పవిత్రమైంది. ఆయన శిష్యుల్లో నాలుగో గురువు రామదాసు అమృతసర్‌లో స్వర్ణ దేవాలయాన్ని నిర్మాణాన్ని ప్రారంభించారు. ఆయన కుమారుడు అర్జునసింగ్ దేవాలయాన్ని పూర్తి చేసి గురువుల సారాంశంతో గురుగ్రంథ్ సాహిబ్‌ను రచించారు. పదో, ఆఖరి గురువైన గురుగోబింద్‌సింగ్ మహరాజ్ ఖల్సా పంథ్‌ను స్థాపించారు. సిక్కు యువతను సైన్యంగా ఏర్పరిచి వీర సైనికులుగా రూపొందించారు. కేశ్ (తల వెంట్రుకలు, గడ్డం) కంఘ (దువ్వెన), కడా (కడియం), కిర్‌పాణ్ (కత్తి), కచ్చా (పొట్టి లాగులు) ధరించాలని సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టారు. ఈ సూత్రాలను ఇప్పటికీ సిక్కులు పాటిస్తారు.

● నేడు గురుద్వారాలో...

జిల్లా కేంద్రంలోని గురుద్వారాలో శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి జన్మదిన పూజలు, మత గురువుల సందేశాలు, ప్రత్యేక ప్రార్థనలు కీర్తనల ఆలాపనపనలు జరుగుతాయి.

నేడు కార్తీక పౌర్ణమి

కరీంనగర్ కల్చరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం జరుపుకోనున్నారు. ఈ రోజు కార్తికేయుడు తారకాసురుడిన సంహరించాడని పురాణాలు చెబుతున్నాయి. ఈ రోజు దీపాలు వెలిగిస్తే పాపాలన్నీ నశిస్తాయి. కార్తీక పౌర్ణమి సందర్భంగా తులసి కోటలో ఉసిరికొమ్మను నిలిపి పక్కన రాధాకృష్ణులను ఉంచి పూజ చేస్తారు. దీపదానం చేస్తారు. వేకువ జామునే అరటి దొప్పలలో దీపాలను పెట్టి నీటిలోకి వదలుతారు. నెయ్యితో తడిపిన వత్తుల దీపాలను వెలిగించి తులసీ కోట చుట్టూ తిరుగుతూ 365 వత్తులతో నక్షత్రాలు కనుమరుగు కాక ముందు హారతి ఇస్తారు. సాయంత్రం నువ్వుల నూనెతో ఆకాశ దీపారాధన చేస్తారు. సాయంత్రం ఏర్పాటు చేసే జ్వాలా తోరణం కింద నుంచి పల్లకీలో పార్వతీ పరమేశ్వరులను నిలిపి మూడుసార్లు ఆలయం చుట్టూ ప్రదక్షిణ పూర్వకంగా నడిచి వెళతారు. కాలిపోగా మిగిలిన గడ్డిని పశువుల మేతలో కలుపుకుంటారు. గడ్డి నుంచి వచ్చిన భస్మాన్ని నుదుట ధరిస్తారు. కార్తీక పౌర్ణమి రోజు ఉసిరి చెట్టు కింద పూజ చేసి వన భోజనం చేస్తారు.

● మార్కెట్‌లో సందడి

కార్తీక పౌర్ణమి సందర్భంగా మార్కెట్‌లో గురువారం సందడి నెలకొంది. ఉసిరి కొమ్మలకు గిరాకీ పెరిగింది. ఒక్కో కొమ్మ 50 నుంచి 80 రూపాయల వరకు, ఉసిరికాయలు పెద్దవి 5 రూపాయలకు రెండు చొప్పున అమ్మారు. వ్యాపారులు ధరలు దించకపో వటంతో వినియోగదారులు నిరాశకు లోనయ్యారు. 20 రూపాయలకు మూర చొప్పున అమ్మే పూల ధర 25 నుంచి 30 రూపాయలు పలికింది. బంతి, చామంతి 50 రూపాయలకు 100 గ్రాములు అమ్మగా, కమలం, లిల్లీ, తామర పూలు ఐదు రూపాయలకు ఒకటి చొప్పున విక్రయించారు. ప్రమిదలకు, వత్తులకు గిరాకీ పలికింది. వివిధ రూపాల్లో ప్రమిదలు 5 నుంచి 50 రూపాయల వరకు, వత్తులు సైజులను బట్టి 15 నుంచి 200 రూపాయల వరకు, రంగులు 10 రూపాయలకు తులం చొప్పున అమ్మారు. తులసి కోటలు 70 నుంచి 500 రూపాయల వరకు, తులసి మొక్కలు 30 నుంచి 40 రూపాయల వరకు అమ్మారు.



మార్కెట్లో ప్రమిదలను కొనుగోలు చేస్తున్న మహిళలు

సత్ఫలితాలనిస్తున్న శుక్రవారం సభ
• కొత్తపల్లి మండలంలో వంద శాతం రిజిస్ట్రేషన్లు
6
ఫ్యాన్సీ నంబర్లకు భలే క్రేజ్
• 3,30,930 ధర పలికిన 9999 నంబర్

నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

సుబాష్ నగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ కలెక్టర్, ఉద్యోగులపై దాడికి నిరసనగా కలెక్టరేట్ ఆవరణలో ఎంప్లాయిస్ జేఏసీ నాయకులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్ మాట్లాడుతూ రాజకీయ నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం ప్రభుత్వ ఉద్యోగులను బలి చేయవద్దన్నారు. గత ప్రభుత్వంలో ప్రభుత్వ ఉద్యోగులపై విచక్షణ రహితంగా దాడులు జరిగాయన్నారు. అలాంటివి పునారవృతం కాకుండా చూసుకోవల్సిన బాధ్యత సీఎం రేవంత్ రెడ్డిపై ఉందన్నారు. కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజీబ్, జేఏసీ కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఎంప్లాయిస్ జేఏసీ బాధ్యులు

● టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో..

వికారబాద్ కలెక్టర్, అధికారులపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణ్ రావు ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి బోజన విరామణ సమంలో నిరసన తెలిపారు.

పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్‌తో నేరస్థులకు చెక్

కరీంనగర్ క్రైం, నవంబరు 14: పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్‌తో పాత నేరస్థులకు చెక్ పెట్టవచ్చని సీపీ అభిషేక్ మొహంతి అన్నారు. కమిషనరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో హుజూరాబాద్, కరీంనగర్ డివిజన్లను చెందిన అధికారులతో నేర సమీక్షా సమావేశాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్‌ను ఆకస్మికంగా నిర్వహించే తనిఖీల్లో ఉపయోగించాలన్నారు. స్టేషన్లలో సీసీ కెమెరాలు పనిచేసేలా చూసుకోవాలన్నారు. చోరీలకు పాల్పడుతున్న దొంగలను పట్టుకోవాలన్నారు. భౌతిక నేరాలు ఎక్కువగా నమోదయ్యే ప్రాంతాల్లో దృష్టి కేంద్రీకరించి వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం తీసుకునే జాగ్రత్త చర్యల్లో భాగంగా యాక్సిడెంట్ జోన్, బ్లాక్‌స్పాట్‌లను గుర్తించాలని సూచించారు. సమావేశంలో ఏసీపీలు జి నరేందర్, జి విజయ్‌కుమార్, శ్రీనివాస్, కాశయ్య, మాధవి, శ్రీనివాస్‌జి పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మొహంతి, పాల్గొన్న అధికారులు

దొంగలు బాబోయ్ దొంగలు..

● వరుస దొంగతనాలతో బెంబేలు

కరీంనగర్ క్రైం, నవంబరు 14: పోలీస్ కమిషనరేట్‌లో వరుసగా జరుగుతున్న దొంగతనాలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కరీంనగర్‌తోపాటు ఇతర శివారు ప్రాంతాల్లో దొంగలు తమ హస్తలాఘవాన్ని ప్రదర్శిస్తూ బంగారం, నగదుతోపాటు బైక్‌లు, ఆటోలు, వాహనాల బ్యాటరీలు చోరీ చేస్తున్నారు. కరీంనగర్ రూరల్ మండల పరిధిలో ఇంటి ఎదుట పార్క్ చేసిన ఆటో చోరీకి గురికాగా పోలీసులు సీసీ కెమెరా ద్వారా గుర్తించి నిందితుడిని అరెస్టు చేశారు. కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఒక ప్రయాణికురాలి బంగారు ఆభరణాల బ్యాగ్‌ను దొంగిలించగా ఒకటో టౌన్ పోలీసులు అంతరాష్ట్ర దొంగల ముఠా సభ్యులు నలుగురిని అరెస్టు చేసి, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. గన్నేరువరం మండలంలోని పలు గ్రామాల్లో ట్రాక్టర్ల బాటరీలు అర్ధరాత్రి సమయాల్లో చోరీకి గురయ్యాయి. దీనిపై లోతుగా విచారణ చేపట్టిన పోలీసులు బ్యాటరీల దొంగను అరెస్టు చేసి బ్యాటరీలు, లింక్‌రాడ్‌లను స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్‌లో దుకాణాలు, ఇళ్ళ ఎదుట, హోటళ్ళ ఎదుట, దేవాలయాల వద్ద పార్క్ చేసిన బైక్‌లను దొంగలు చోరీ చేశారు. జ్యోతినగర్ ప్రాంతంలో ఒక అపార్ట్‌మెంట్ పార్కింగ్ స్థలంలో పార్క్ చేసిన కారును దొంగలు ఎత్తుకుపోగా పోలీసులు పట్టుకున్నారు. కరీంనగర్ ప్రగతినగర్, రాంనగర్, టెలిఫోన్ క్వార్టర్స్ రోడ్‌లో వరుసగా మూడు దొంగతనాలు జరిగి విలువైన బంగారు ఆభరణాలు, నగదు, ఇతర సామాగ్రి దొంగలపాలయ్యాయి. ఇందులో ఒక కేసులో బంగారు ఆభరణాలను దొంగలించిన ఒక మహిళా నిందితురాలు, ఆమెకు సహకరించిన మరో వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



● తాళం వేసిన ఇళ్లే టార్గెట్

కొద్ది కాలం నుంచి తాళం వేసిన ఇళ్లనే టార్గెట్ చేసి దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. నగరంలో రాత్రి సమయాల్లో పోలీస్ పెట్రోలింగ్ ఉన్నప్పటికీ ఇళ్లలో దొంగతనాలకు పాల్పడడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. నగరంలో చోరీకి గురైన బైక్‌లు, బంగారం, నగదు కొన్ని కేసుల్లో ఇప్పటికీ రికవరీ కావడం లేదు. కరీంనగర్‌లోని ప్రధాన కూరగాయల మార్కెట్‌లో నిత్యం మొబైల్‌ఫోన్లు చోరీకి గురవుతూనే ఉన్నాయి. బాధితులు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేస్తూనే ఉన్నారు. సీఐఈఆర్ పోర్టల్ ద్వారా బాధితులు ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ ఫోన్లు దొరకడం లేదు. ఆలయాల్లో హుండీలనూ దొంగలు వదలడం లేదు. అర్ధరాత్రి హుండీలను పగులగొట్టి నగదును ఎత్తుకుపోతున్నారు. అత్యాధునిక సీసీ కెమెరాలు, ఇతర సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిజ్ఞానం ఉపయోగిస్తున్నా నిందితులు కొన్ని కేసుల్లో దొరకకుండా తప్పించుకుంటున్నారు.పోలీసు యంత్రాంగం రాత్రి వేళ పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, దొంగతనాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చిన్నారులను సన్మార్గంలో నడిపించాలి

- బాలల దినోత్సవంలో కలెక్టర్ పమేలా సత్పతి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి,



చిన్నారితో కలెక్టర్

కరీంనగర్ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పిల్లలు దైవానికి ప్రతి రూపం.. వారిని సన్మార్గంలో నడిపిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, అందుకు పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యా యులు కృషిచేయాలని కలెక్టర్ పమేలా సత్పతి పిలుపుని చ్చారు. గురువారం కలెక్టరేట్ ఆడిటోరియంలో మహిళాభి వృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వ ర్యంలో నిర్వహించిన బాలల దినోత్సవంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులను సన్మార్గంలో నడిపించాలని సూచించారు. నేర్చుకోవాలనే తపన, అంకితభావం, శ్రద్ధ ఉంటే ఏదైనా సాధించవచ్చని పిల్లలకు సూచించారు. విద్యతోపాటు నిర్దిష్ట లక్ష్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ పిల్లలు మంచి మార్గంలో పయనించాలన్నారు. రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు శోభారాణి మాట్లాడుతూ పిల్లలకు సమాజంపై అవగాహన ముఖ్యమని అన్నారు. మత్తు పదార్థాలు, లైంగిక వేధింపుల నుంచి పిల్లలను కాపాడడం ఉపాధ్యాయుల బాధ్యతగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి చిన్నారుల కోసం రాసి, పాడిన పాటను ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్ ఆవిష్కరించారు. చిన్నారుల నృత్య ప్రదర్శన, చిన్నారుల వేషధారణ, మ్యాజిక్ షో ఆకట్టుకున్నాయి. దత్తత మాసం పోస్టర్‌ను అధికారులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం సరస్వతి, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ ధనలక్ష్మి, ఎస్సీ వెల్ఫేర్ ఎడి నాగార్జున, ఎస్‌వైకే కో ఆర్డినేటర్ రాంబాబు, డీసీపీవో పర్వీన్ పాల్గొన్నారు.

● విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఆ దిశగా కష్టపడి విజయం సాధించాలని కలెక్టర్ పమేలా సత్పతి విద్యార్థులకు సూచించారు. సప్తగిరికాలనీ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో నిర్వహించిన బాలల దినోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులకు షూ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి అవసరాలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఈవో జనార్దన్‌రావు, ఎస్సీ సంక్షేమ శాఖ ఈడీ నాగార్జున, ఎస్‌వైకే కో ఆర్డినేటర్ రాంబాబు, బాలికల అభివృద్ధి అధికారి కృపారాణి పాల్గొన్నారు.

సత్ఫలితాలనిస్తున్న శుక్రవారం సభ

- గర్భిణులకు పౌష్టికాహారం అందజేత
- సాధారణ బరువుతో జన్మిస్తున్న శిశువులు
- ఆరోగ్య కేంద్రాల్లో ఉచిత పరీక్షలు
- కొత్తపల్లి మండలంలో వంద శాతం రిజిస్ట్రేషన్లు



శుక్రవారం సభలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి (ఫైల్)



తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

భగత్‌నగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శుక్రవారం సభ సత్ఫలితాలనిస్తోంది. కొత్తపల్లి మండలంలో వంద శాతం మహిళల వివరాలు నమోదు చేసుకున్నారు. మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి శుక్రవారం సభలు నిర్వహిస్తున్నారు. కొత్తపల్లి మండలవ్యాప్తంగా 33 అంగన్ వాడీ కేంద్రాలు ఉన్నారు. అన్ని కేంద్రాల్లో గర్భిణులు 299 మంది, పాలిచ్చే మహిళలు 184 మంది, ఆరు నెలలలోపు పిల్లలు 149, ఏడు నెలల నుంచి మూడు సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న పిల్లలు 1564 మంది, 3 సంవత్సరాల నుంచి ఆరు సంవత్సరాల మధ్య పిల్లలు 1438 మంది ఉన్నట్లు నమోదు చేశారు. మండల వ్యాప్తంగా నిర్వహిస్తున్న శుక్రవారం సభతో కొత్తగా పుట్టిన పిల్లల రిజిస్ట్రేషన్‌ల శాతం పెరుగుతు వస్తున్నది. ఆరు నెలల్లోనే మండల వ్యాప్తంగా 147 రిజిస్ట్రేషన్లు చేశారు. మే నెలలో 22, జూన్‌లో 27, జూలై 35, ఆగస్టులో 18, సెప్టెంబరులో 25, అక్టోబరులో 20 మందిని కలుపుకుని మొత్తంగా ఇప్పటి వరకు 147 న్యూబోర్న్ రిజిస్ట్రేషన్లు నమోదు చేశారు. మే నుంచి అక్టోబరు వరకు నమోదైన 147 మంది శిశువులు సాధారణ బరువు, అంతకంటే ఎక్కువ బరువుతో జన్మించారు. గర్భిణులుగా ఉన్నప్పటి నుంచే పౌష్టికాహారం అందజేయడంతోనే ఇది సాధ్యమైంది.

● అంగన్‌వాడీల ద్వారా పోషహాకారం

అంగన్‌వాడీల ద్వారా మంచి ఆహారం శుభ్రమైన తాగునీరు, సరిపడా నిద్ర వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని మహిళలకు సూచిస్తున్నారు. అంగన్ వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందిస్తుండడంతో, ఆరు సంవత్సరాల లోపు చిన్నారులను తప్పనిసరిగా అంగన్ వాడీ కేంద్రాల్లోనే చేర్పించాలని కోరుతున్నారు. శుక్రవారం సభతో కొత్తపల్లి మండల వ్యాప్తంగా ఆరోగ్య వంతమైన శిశు జననాలు పెరుగుతున్నాయని ఇటీవల కరీంనగర్‌లో పర్యటించిన ఫుడ్ కమిషన్ సభ్యులు ప్రకటించారు.

● ఆరోగ్య కేంద్రాల్లో 52 పరీక్షలు

శుక్రవారం సభతో మహిళల్లో చైతన్యం పెరిగిపోయింది. ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహిస్తున్న 52 ఉచిత పరీక్షలు నిర్వహిస్తుండడంతో మహిళలు వైద్య పరీక్షలు చేయించు కుంటున్నారు. యాభైవేల రూపాయల వరకు ఖర్చయ్యే పరీక్షలను ప్రభుత్వం ఉచి తంగా చేస్తుండడంతో మహిళలు ఆసక్తి చూపిస్తున్నారు. శుక్రవారం సభ ప్రోత్సాహంతో 78 శాతం డెలివరీలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరుగుతున్నాయని అధికారులు ప్రకటించారు.

● ప్రభుత్వ పథకాలపై అవగాహన

జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న శుక్రవారం సభతో ప్రభుత్వం నుంచి అందుతున్న పథకాలపై అవగాహన ఏర్పడింది. అధికారులంతా శుక్రవారం సభకు హాజరవుతుండడంతో ప్రజలకు కావాల్సిన పథకాలను తెలుసుకుని దరఖాస్తు చేసుకునే వెసులు బాటు లభించడంతో శుక్రవారం సభకు మంచి స్పందన చేకూరుతున్నది.

ఫ్యాన్సీ నంబర్లకు భలే క్రేజ్

- 3,30,930 ధర పలికిన 9999 నంబర్

తిమ్మాపూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వాహనాల ఫ్యాన్సీ నంబర్లకు భలే క్రేజ్ ఉంది. రవాణా శాఖ ఫ్యాన్సీ నంబర్లకు వేలం నిర్వహిస్తుంది. ఇటీవల వాహనాల రిజిస్ట్రేషన్‌ను టీఎస్ నుంచి టీజీగా మార్చారు. దీంతో కొత్త నంబర్ ప్లేట్లకు అప్‌డేట్ కావాలని చాలా మంది ఆసక్తి చూపుతున్నారు. ఇందులో భాగంగా గురువారం తిమ్మాపూర్ మండల కేంద్రంలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో వాహనాల నంబర్ల కోసం ఆన్‌లైన్‌లో వేలం నిర్వహించారు. ఈ వేలంలో టీజీ 02 9999 నంబర్‌ప్లేట్‌కు రవాణా శాఖ 50వేల రూపాయలతో వేలం ప్రారంభించారు. కరీంనగర్ ఆర్ఎస్ బ్రదర్స్ రిటైల్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ ఈ నంబర్‌ను 3,30,930 రూపాయలు చెల్లించి దక్కించుకుంది.

- టీజీ 02 బి 0001 నంబరుకు 50 వేల రూపాయలతో ప్రారంభించగా 75 వేలకు వికాస్ హనుమాన్‌ప్రసాద్ మిట్టల్ అనే వ్యక్తి దక్కించుకున్నాడు.

- టీజీ 02 బి 0003 నంబర్‌కు 10 వేలతో ప్రారంభించగా 22,116 రూపాయలకు ఎస్ తిరుపతి, టీజీ 02 బి 0004 నంబర్‌ను 21,116కు సాయితేజ, టీజీ 02 బి 0006 నంబరును 1605కు వాణి కొంగర, టీజీ 02 బి 0007 నంబరును 41,200రూపాయలు చెల్లించి సాయి వాణి ఆర్ఎంసీ ప్రైవేట్ లిమిటెడ్ దక్కించుకుంది. ఫ్యాన్సీ నంబర్లు కావాల్సిన వారు రవాణా శాఖ కార్యాలయంలో సంప్రదించాలని డీటీసీ పి పురుషోత్తం తెలిపారు.

నేడు డయల్ యువర్ ఆర్ఎం

భగత్‌నగర్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా ఒసంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్ఎం ఎస్ సుచరిత ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని ప్రయాణికులు శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ కార్యక్రమంలో భాగంగా 9063403511 నంబర్‌కు కాల్ చేసి ప్రయాణికులు సమస్యలు, ఫీడ్ బ్యాక్‌ను అందించాలని కోరారు.

● కరీంనగర్ -1 డిపో పరిధిలోని కరీంనగర్, మానకొండూర్, ఇల్లంతకుంట, బెజ్జంకి, జమ్మికుంట మండలాల ప్రయాణికులు శుక్రవారం ఉదయం 11 గంటలనుంచి 12 గంటల డయల్ చేసి సమస్యలు వివరించాలని డీఎం ఐ విజయమాధురి ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్-1 డిపో పరిధిలోని ప్రయాణికులు సమస్యలు, సలహాలు, సూచనలను 8121993780 నంబర్‌కు కాల్ చేయాలన్నారు.

ఎస్‌యూలో వ్యాసరచన పోటీలు

గణేశ్‌నగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాలలో తెలంగాణ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక సంఘం వారి సౌజన్యంతో డాక్టర్ జయంతి ప్రిన్సిపల్ అధ్యక్షతన జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస క్విజ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప కులపతి ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ హాజరు కాగా కన్వీనర్ డాక్టర్ రవికుమార్, కోఆర్డినేటర్ డాక్టర్ ప్రసాద్, డాక్టర్ మూర్తి డాక్టర్ కిరణ్, డాక్టర్ జోసఫ్ రాజు, డాక్టర్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో ఎస్సారార్ కళాశాల విద్యార్థులకు పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ అంతర డిగ్రీ కళాశాలల అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొని పతకాలు సాధించారు. శాతవాహన యూనివర్సిటీ మైదానంలో బుధవారం నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో ఎస్సారార్ విద్యార్థులు పాల్గొని 20 కిలోమీటర్ల రేస్ వాక్‌లో విష్ణువర్ధన్ బంగారు పతకం సాధించాడు. 800 మీటర్ల రన్నింగ్‌లో కె రవి బంగారు, 1500 మీటర్ల రన్నింగ్‌లో పతకాలను సాధించాడు. డిస్కస్ త్రో, జావెలిన్ త్రో అంశాల్లో కె స్వామి బంగారు పత ాలు సాధించాడు. 800 మీటర్ల రన్నింగ్‌లో ఎం అనిల్ రజత, 10కిలోమీటర్ల విభాగంలో బంగారు పతకాలు సాధించాడు. ఐదు కెఎం, 10 కెఎం రన్నింగ్‌లో బి గణపతి రజత పతకాలు సాధించాడు. ఈ సందర్భంగా గురువారం పతకాలు సాధించిన విద్యార్థులను ఎస్సారార్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కల్వకుంట్ల రామకృష్ణ, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ నాగేశ్వర్‌రావు, స్టాఫ్ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు అభినందించారు.

● అఖిల భారత క్రాస్ కంట్రీ పోటీలకు ఎంపిక

తమిళనాడు రాష్ట్రంలోని మంగళూరు యూనివర్సిటీలో ఈ నెల చివరి వారంలో జరిగే అఖిల భారత అంతర యూనివర్సిటీల క్రాస్ కంట్రీ పోటీలకు ఎస్సారార్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. యూనివర్సిటీ స్థాయి క్రాస్ కంట్రీ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన విష్ణువర్ధన్, సంతోష్‌లు పురుషుల విభాగంలో కీర్తన మహిళా విభాగంలో అంతర యూనివర్సిటీ పోటీలకు ఎంపికయ్యారని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ నాగేశ్వర్‌రావు తెలిపారు. వీరిని ప్రిన్సిపాల్ రామకృష్ణ అభినందించారు.

'సహకార సంఘాలకు పూర్వవైభవం'

కరీంనగర్ టౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర సహకార శాఖ మంత్రి అమిత్‌షా నేతృత్వంలో దేశంలోని సహకార సంఘాలు పూర్వ వైభవాన్ని సంతరించుకుంటున్నాయని నాఫ్స్కాబ్, కేడీసీసీబీ చైర్మన్ రవీందర్‌రావు అన్నారు. గురువారం 71వ అఖిల భారత సహకార వారోత్సవాల్లో భాగంగా ఆయన కేడీసీసీబీ ప్రధాన కార్యాలయంలో సహకారశాఖ జెండాను ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించారు. సహకార సంఘాల అభివృద్ధికి కృషి చేస్తామని ఉద్యోగులతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత మాజీ సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంస్కరణలు తీసుకురావడం ద్వారా సహకార సంస్థల్లో పురోగతి సాధించిందని చెప్పారు. ఇప్పుడు అమిత్ షా నేతృత్వంలో ప్రత్యేక సహకార మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయడంతో అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. బ్యాంకు సీఈవో సత్యనారాయణరావు మాట్లాడుతూ 2023-24 సంవత్సరానికిగాను ఆల్ రౌండ్ పనితీరుకు కేడీసీసీబీ ఆల్ ఇండియా ఫస్ట్‌బెస్ట్ అవార్డుకు నాఫ్స్కాబ్ ఎంపిక చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ పి.రమేశ్, డైరెక్టర్లు, డీసీవో రామానుజాచార్య, కోఆపరేటివ్ ఇన్‌స్ట్రక్టర్ వెంకటేశ్వర్లు, జనరల్ మేనేజర్లు బి.శ్రీధర్, రియాజుద్దీన్, యూనియన్ అధ్యక్షుడు జి.హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

విదేశానికి పంపిస్తానని మోసం.. వ్యక్తి రిమాండ్

ఎల్లారెడ్డిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విదేశానికి పంపిస్తానని డబ్బులు తీసుకుని మోసగించిన సంఘటనలో కరీంనగర్ పట్టణానికి చెందిన మినాహాజ్ అలీ అనే వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ రమాకాంత్ గురువారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట మండలంలోని గుండారంలోని యువకుడు న్యాలపల్లి బ్రహ్మచారిని హాంకాంగ్ దేశానికి పంపిస్తానని నమ్మబలికి రూ 1.20 లక్షల నగదు తీసుకున్నాడని పేర్కొన్నారు. ఎన్ని సార్లు అడిగిన విదేశానికి పంపించకపోవడంతో పాటు తీసుకున్న డబ్బులు తిరిగి చెల్లించలేదని చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఈ యేడాది ఆగస్టు 10న స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. తప్పించుకుని తిరుగుతున్న మినాహాజ్‌అలీని ఖచ్చితమైన సమాచారంతో గురువారం పట్టుకుని రిమాండ్‌కు తరలించామని తెలిపారు. ప్రజలు గుర్తు తెలియని వ్యక్తులను నమ్మి డబ్బులు చెల్లించి మోసపోకూడదని ఎస్ఐ రమాకాంత్ కోరారు.

భూసార పరీక్ష కేంద్రాల జాడేది..?

● పరికరాలు, సిబ్బంది కేటాయింపు కరువు...

హుజూరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రైతుల పంట దిగుబడులు పెరగడానికి సూచనలు ఇవ్వాలంటే భూసార పరీక్ష కేంద్రాలు తప్పనిసరి... ఏడాదిన్నరగా భూసార పరీక్ష కేంద్రాల జాడే లేకుండా పోయింది... రైతుల భూముల మట్టి నమూనాలను సేకరించి.. పరీక్షలు నిర్వహించి.. ఏ పంట వేసుకోవాలో ఈ భూసార పరీక్ష కేంద్రాల ద్వారా తెలుస్తోంది.



హుజూరాబాద్ డివిజన్‌లో మాత్రం భూసార పరీక్ష కేంద్రాలు లేకుండా పోయాయి. ఎవరైనా రైతులు భూసార పరీక్షలు చేసుకోవాలంటే జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిందే. ఇందు కోసం రైతులు ఖర్చులు పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. 2018లో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు వేదికల్లో భూసార పరీక్షలు నిర్వహించాలని, కిట్లు, కెమికల్ పంపించారు. ఆ తర్వాత భూసార పరీక్ష కేంద్రాల గురించి పట్టించుకోలేదు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వమైనా హుజూరాబాద్ డివిజన్‌లో భూసార పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసి, సిబ్బందిని, పరికరాలను కేటాయించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

● ఎరువుల వాడకం తగ్గించేందుకు..

భూసార పరీక్షలు జరిగితే ఎరువుల వాడకం ఏ మోతాదులో వాడాలో తెలుస్తోంది. అందుకు అవసరమైన ఎరువులను వేసుకునే వెసులుబాటు ఉంటుంది. భూసార పరీక్షలు జరపకపోవడంతో రైతులు ఇష్టారీతిన ఎరువులను వినియోగిస్తున్నారు. పంటల మార్పిడి కూడా చేయడం లేదు. నేల స్వభావం తెలియకపోవడంతో ఇష్టానుసారంగా రైతులు ఎరువులను చల్లుతున్నారు. దీంతో దిగుబడులు తగ్గడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ ఎరువుల వాడకంతో నేల తన సహజ స్వభావాన్ని కోల్పోవడంతో పాటు రైతులపై ఆర్థిక భారం పడుతుంది. భూసార పరీక్షలు నిర్వహిస్తే పోషకాల లోపాలను గుర్తించి అవసరమైన మేరకే ఎరువులు వినియోగించే వీలు కలుగుతుంది.

ప్రిన్సిపాల్‌పై దాడికి పాల్పడ్డ భర్త, సోదరుడిపై కేసు నమోదు

జగిత్యాలరూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ మహాత్మాజ్యోతిబాపూలే బీసీ గురుకుల కళాశాలలో ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న ఎడెల్లి మమత పై దాడి కి పాల్పడ్డ ఆమె భర్త గంగిపెల్లి సంపత్‌కుమార్, సోదరుడు రాజశేఖర్ లపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మమతను తన భర్త గంగిపెల్లి సంపత్‌కుమార్ అదనంగా రూ. 5 లక్షలు అదనపు కట్నం తేవాలని వేధించడమేకాకుండా, గురువారం లక్ష్మీపూర్‌లో గల గురుకుల పాఠశాలకు వచ్చి మమతను అనుమానిస్తూ మమత పై సంపత్‌కుమార్, రాజశేఖర్ లు దాడికి పాల్పడ్డట్లు తెలిపారు. మమత ఫిర్యాదు మేరకు ఇద్దరి పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు.

సైబర్ నేరాలకు పాల్పడుతున్న ముగ్గురి అరెస్ట్

- పరారీలో మరో ఇద్దరు నిందితులు - వివరాలు వెల్లడించిన మెట్‌పల్లి సీఐ

మెట్‌పల్లి టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు. మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి సర్కిల్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. రెండు నెలల క్రితం మెట్‌పల్లి పట్టణానికి చెందిన ఓ వైద్యుడి ఖాతా నుంచి స్టాక్ మార్కెట్ బిజినెస్‌లో ఇన్వెస్ట్మెంట్ ట్రేడింగ్ పేరుతో సైబర్ నిందితులు 69 లక్షలు రూపాయలు కాజేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. ఈ మేరకు పోలీసులు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శికాగోయల్, ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు మెట్‌పల్లి డీఎస్పీ ఆధ్వర్యంలో డీఎస్పీ వెంకటరంగారెడ్డి నేతృత్వంలో ఎడుగురు ప్రత్యేక బృందంగా ఏర్పడ్డారు. విచారణలో భాగంగా స్టాక్ మార్కెట్ యాప్ పేరిట సైబర్ క్రైంకు పాల్పడిన నిందితుల బ్యాంక్ ఖాతాలను గుర్తించారు. నిందితులు పంజాబ్‌లోని అమృత్‌సర్, జలంధర్‌లో ఉన్నట్లు గుర్తించి అక్కడికి వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నారు. ఇందులో పంజాబ్‌కు చెందిన ఏ1 నిందితుడు సుమేష్‌కపూర్, ఏ2 నిందితుడు రాజీవ్ సింగ్, ఏ3 నిందితుడు జతిందర్ కుమార్ హిమాచల్ రాష్ట్రానికి చెందిన వారిగా గుర్తించారు. వీరు ముగ్గురూ జల్సాలకు అలవాటు పడి పంజాబ్‌లోని యూనియన్ బ్యాంక్‌లో పని చేసే అర్జున్ చౌహాన్ ఏ-4 నిందితుడితో పరిచయం చేసుకున్నారు. ఈ నలుగురూ కలిసి సైబర్ మోసాలకు తెరలేపారు. ఇందులో భాగంగా మెట్‌పల్లి పట్టణానికి చెందిన వైద్యుడి ఖాతా నుంచి వడతల వారీగా 69 లక్షల రూపాయలు కాజేసి దుబాయ్‌లో ఉండే రాజు ఎ-5 అనే నిందితుడికి పంపారు. ఇలా నేరాలకు పాల్పడుతూ వచ్చే డబ్బులను దుబాయ్‌లోని ఓ ముఠా ద్వార ట్రాన్సక్షన్ చేస్తున్న ట్లు పోలీసులు గుర్తించారు. ఈ ముగ్గురినీ ఈ నెల 11న పంజాబ్‌లోని జలంధర్‌లో అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. వారి వద్ద నుంచి బ్యాంక్ ఖాతా పుస్తకాలు 15, చెక్ బుక్కులు, డెబిట్, క్రెడిట్ కార్డు, మొబైల్ ఫోన్లు, ల్యాప్ టాప్స్, సిమ్ కార్డులను స్వాధీనం చేసుకోని సీజ్ చేసినట్లు తెలిపారు. వీరిని జలంధర్ కోర్టులో హాజరు పరిచి ట్రాన్సిట్ వారెంట్ మీద మెట్‌పల్లికి తీసుకువచ్చి దర్యాప్తు అనంతరం ముగ్గురిని కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. పరారీలో ఉన్న మిగతా నిందితుల కోసం ప్రత్యేక గాలిస్తున్నట్లు సీఐ తెలి పారు.

క్రైం కార్నర్

వేర్వేరు చోట్ల ప్రమాదాలు,, నలుగురి మృతి

ఉమ్మడి జిల్లా పరిధిలో గురువారం వేర్వేరు చోట్ల జరిగిన ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు. గన్నేరువరం మండలంలో ట్రాక్టర్ రోటవేటర్‌లో ఇరుక్కుని రైతు, చొప్పదండిలో రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందారు. మానకొండూర్ మండలంలో తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు, జగిత్యాల జిల్లా భీమారం మండలంలో పెళ్లి ఊరేగింపులో డ్యాన్స్ చేస్తూ ఓ యువకుడు మృతి చెందారు.

● ట్రాక్టర్ రోటవేటర్‌లో ఇరుక్కొని రైతు మృతి



ప్రభాకర్‌రెడ్డి (ఫైల్)

గన్నేరువరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలంలోని పారువెల్ల గ్రామానికి చెందిన ఎల్లాల ప్రభాకర్‌రెడ్డి, అలియాస్ సుధాకర్‌రెడ్డి(55) అనే రైతు గురువారం ప్రమాదవశాత్తు ట్రాక్టర్ రోటవేటర్‌లో ఇరుక్కొని మృతి చెందాడు. ప్రభాకర్‌రెడ్డి తన వ్యవసాయ భూమిలో ట్రాక్టర్‌కు రోటవేటర్‌ను బిగించి భూమిని చదును చేస్తున్నాడు. ఆ సమయంలో చేనులో ఉన్న డ్రిప్ పైపులు అడ్డు తగిలాయి. వాటిని తొలగించేందుకు ఇంజన్‌ను ఆన్‌లోనే ఉంచి ట్రాక్టర్‌పై నుంచి దిగాడు. ముందు ఉన్న పైపులను తొలగించే క్రమంలో రోటవేటర్ కుదుపుకు ట్రాక్టర్ ముందుకు కదిలింది. ట్రాక్టర్ రోటవేటర్‌ల మధ్యలో ప్రభాకర్‌రెడ్డి ఇరుక్కుపోయాడు ఐదు మీటర్ల దూరం వరకు ట్రాక్టర్ లాక్కెళ్లి చెట్టుకు ఢీకొని నిలిచిపోయింది. తీవ్రగాయాలతో ఉన్న ప్రభాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ప్రభాకర్‌రెడ్డి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తాండ్ర నరేష్ తెలిపారు.

● రోడ్డు ప్రమాదంలో యువకుడు..

చొప్పదండి, నవంబరు14 (ఆంధ్రజ్యోతి) మండలంలోని గుమ్లాపూర్ శివారులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మరొకరికి గాయాలయ్యాయి. ఎస్సై అనూష తెలిపిన వివరాల ప్రకారం.. బోయినపల్లి మండలం మర్లపేటకు చెందిన జంగపల్లి విజయ్(25) మిత్రుడితో కలిసి బైక్‌పై చొప్పదండిలో పెళ్లి రిసెప్షన్‌కు వెళ్తున్నాడు. గుమ్లాపూర్ శివారులో ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. విజయ్ తీవ్ర గాయాలతో అక్కడిక్కడే మృ తి చెందాడు. బైక్ పై ఉన్న మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ప్రతిమ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు..

మానకొండూర్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పచ్చునూర్ గ్రామానికి చెందిన మూడగాని కనుకయ్యగౌడ్ (54) గురువారం తాటిచెట్టు పై నుంచి పడి మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. కనుకయ్య కల్లు గీయడానికి తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. తీవ్ర గాయాలతో అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కనుకయ్యగౌడ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కనుకయ్యగౌడ్ భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

పెళ్లి ఊరేగింపులో డ్యాన్స్ చేస్తూ..



సంజయ్(ఫైల్)

మేడిపల్లి/భీమారం నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా భీమారం మండలంలోని మోత్కురావుపేటలో బుధవారం జరిగిన పెళ్లి ఊరేగింపులో ఓ యువకుడు డ్యాన్స్ చేస్తూ గుండెనొప్పితో మృతి చెందాడు. మండలంలోని కమ్మరిపేట గ్రామానికి చెందిన వన్నెల సంజయ్ (23) హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. సంజయ్ మేనమామ వివాహం మోత్కురావుపేటలో బుధవారం ఉండడంతో పెళ్లికి హాజరయ్యాడు. అనంతరం రాత్రి 1 గంటకు జరిగిన పెళ్లి ఊరేగింపు వేడుకల్లో కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నాడు. ఊరేగింపులో డ్యాన్స్ చేస్తూనే ఒక్కసారిగా సంజయ్ కుప్పకూలాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే జగిత్యాలలోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సంజయ్ తండ్రి ఫిర్యాదు మేరకు మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

అనుమానమే పెనుభూతమై..

- భార్యను చంపి భర్త ఆత్మహత్య- సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఘటన



వెంకటేశం, వసంత(ఫైల్)

సిరిసిల్ల క్రైం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అనుమానమే పెనుభూతమై భార్యను హత్య చేసి భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో గురువారం వెలుగుచూసింది. స్థానికుల వివరాల ప్రకారం... సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన ముదాం వెంకటేశం (40) తన భార్య వసంత (36)ను బుధవారం మధ్యాహ్నం పని ఉందని ద్విచక్రవాహనంపై పొలం వద్దకు తీసుకెళ్లి కర్రతో కొట్టిచంపాడు. ఆ తర్వాత భర్త వెంకటేశం పురుగుల మందు తాగి తాను ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పొలానికి వెళ్లిన వెంకటేశం, వసంత ఇంటికి రాకపోవడంతో గురువారం ఉదయం వెంకటేశం సోదరుడు శ్రీనివాస్ పొలం వద్దకు వెళ్లగా ఇద్దరి మృతదేహాలు పొలంలో పడి ఉన్నాయి. ఆయన పోలీసులకు సమాచారం అందించాడు. సిరిసిల్లకు చెందిన ముదాం వెంకటేశం తంగళ్లపల్లి మండలంలోని మండెపల్లికి చెందిన సమీప బంధువైన వసంతను ప్రేమించి పెద్దలను ఒప్పించి 2006లో పెళ్లిచేసుకున్నాడు. వీరికి ఒక కూతురు వర్షిణి, కుమారుడు అజిత్ ఉన్నారు. మూడునెలల క్రితం వసంత పోస్ట్ ఆఫీస్‌లోని ఆధార్ నమోదు కేంద్రంలో ఆపరేటర్‌గా విధుల్లో చేరింది. అప్పటి నుంచి తరుచూ ఫోన్‌లో మాట్లాతుడడంతో వెంకటేశం భార్యపై అనుమానం పెంచు కున్నాడు. దీంతో ఇద్దరి మధ్యలో గొడవలు జరుగుతున్నాయి. బుధవారం భార్య వసంతను పొలం వద్దకు తీసుకెళ్లిన వెంకటేశం కర్రతో కొట్టి చంపాడు. ఆ తర్వాత తానూ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వసంత తల్లి అంజవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కె కృష్ణ తెలిపారు.

కాట్రపల్లిలో ఎలుగుబంటి సంచారం

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్రపల్లి గ్రామంలో గురువారం ఎలుగుబంటి సంచరించడంతో స్థానిక లు భయాందోళన చెందుతున్నారు. గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రంలో పనులు చేస్తున్న గాంధారి వనమ్మ అనే మహిళపై ఎలుగుబంటి దాడి చేయడంతో గాయపడింది. చికిత్స నిమిత్తం జమ్మికుంట పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఎలుగుబంటి సంచారంపై అటవీశాఖాధికారులకు సమాచారం అందించారు. అటవీ శాఖ రేంజ్ ఆఫీసర్, లత, సెక్షన్ ఆఫీసర్ సౌమ్య, బీట్ ఆఫీసర్ సురేష్, స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఎలుగుబంటి మాణిక్యాపూర్ వైపు వెళ్లినట్లు అధికారులు వెల్లడించారు.

చోరీ చేసి.. ఆధారాలు లభించకుండా కడిగేసి..

- రూ.5లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ.1.50 నగదు అపహరణ

ఎల్లారెడ్డిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇంటిలో చోరీ చేసిన గుర్తు తెలియని వ్యక్తులు ఆధారాలు లభించకుండా నీళ్లతో కడిగేసి జారుకున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని పిల్లి రణధీర్ ఇంటిలో ఆరు నెలల్లో రెండుసార్లు దొంగతనం చోటు చేసుకోవడం స్థానికంగా కలకలం రేపుతోంది. తాళం వేసి ఉన్న ఇంటిలోకి గురువారం చొరబడిన నిందితులు ఐదు లక్షల రూపాయల విలువైన బంగార ఆభరణాలతో పాటు రూ 1.50 లక్షలు అపహరించుకుపోయారు. పోలీసులు, బాధితుల కథనం మేరకు.. గ్రామంలోని రణధీర్ కుటుంబసభ్యులు ఈ నెల 12న ఇంటికి తాళం వేసి కరీంనగర్‌లోని బంధువుల ఇంటికి శుభకార్యానికి వెళ్లారు. గురువారం ఉదయం చుట్టు పక్కల వారు చూసే సరికి ఇంటి తాళాలు పగులకొట్టి కనిపించడంతో రణధీర్‌కు సమాచారం అందించారు. స్వగ్రామానికి చేరుకున్న రణధీర్ పోలీసులకు విషయం తెలిపాడు. ఎస్ఐ రమాకాంత్ ఆధ్వర్యంలోని ప్రత్యేక పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. చోరీకి పాల్పడిన వ్యక్తులు ఎలాంటి ఆధారాలు లభించకుండా నీళ్లతో కడిగి పోయారని గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి వ్యక్తికి తీవ్రగాయాలు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామ శివారులోని సత్తేపీరీల దర్గా మూలమలుపు వద్ద గురువారం ద్విచక్రవాహనం అదుపు తప్పింది. ఈ సంఘటనలో మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బొడిగె మధు తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మధు తన బైక్‌పై స్వగ్రామం నుంచి ఎల్లారెడ్డిపేట వైపుకు వస్తున్న క్రమంలో అదుపు తప్పి వ్యవసాయ పొలంలోకి దూసుకుపోయింది, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వివరించారు.

తినుబండారాల తయారీతో స్వయం ఉపాధి

సుల్తాన్‌పూర్ స్వశక్తి మహిళల ఆదర్శం



తయారైన కజ్జెలు

అమ్మకానికి సిద్ధంగా ఉన్న లడ్డూలు

ఎలిగేడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఎలిగేడు మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన స్వశక్తి మహిళలు తినుబండారాల తయారీతో స్వయంఉపాధి పొందుతున్నారు. 15ఏళ్లుగా గారెలు, అరిసెలు, సకినాలు, మురుకులు, లడ్డూలు ఆర్డరుపై తయారు చేసిస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. మొదట్లో ఆరుగురు మహిళలతో ప్రారంభం కాగా, ప్రస్తుతం 20మంది వరకు వీరిదగ్గర ఉపాధి పొందుతున్నారు. 30వరుసల సకినాలు, కేజీ లడ్డు, పెద్దపెద్ద జిలేబీలు తయారుచేయడం వీరి ప్రత్యేకత. పక్కనే ఉన్న కరీంనగర్ జిల్లా కేంద్రం నుంచి నాణ్యమైన ముడిసరుకులు తీసుకొచ్చి రుచికరమైన తినుబండారాలు తయారు చేసి ఇవ్వడంతో వీరికి మంచి పేరువచ్చింది. ఈ ప్రాంతం నుంచి విదేశాలకు వెళ్లిన వారుసైతం ఇక్కడి తమ బంధువుల ద్వారా వీరికి ఆర్డర్ చేసి గారెలు, సకినాలు, అరిసెలు తదితర తినుబండారాలను తెప్పించుకుంటున్నారు.



చకినాలు పోస్తున్న మహిళలు

నాణ్యమైన అప్పడాలు అందిస్తున్నాం

- సుభాషిణి



అప్పడాలు ఆర్డర్ చేసిన వినియోగదారునికి నాణ్యమైన అప్పడాలు అందిస్తున్నాం. మా వద్ద కొనుగోలు చేసిన వారే ఇతరులకు చెబుతుండడంతో ప్రస్తుతం పెద్దసంఖ్యలో కొనుగోలుదారులు మా వద్దకు వస్తున్నారు.

ముడిసరుకులు స్వచ్ఛమైనవి ఉపయోగిస్తాం..



- లక్ష్మీదేవి

తినుబండారాల తయారీకి ఉపయోగించే ముడిసరుకులు కరీంనగర్ నుంచి తెప్పిస్తాం. నాణ్యమైన సరుకులు ఉపయోగించడం వల్ల రుచికరమైన అప్పడాలు తయారుచేసిస్తాం.. తిన్నవారు సంతృప్తి చెందారు.

వినియోగదారుల నమ్మకమే కొండంత అండ.

- శ్యామల



పదిహేనేళ్ల క్రితం భయంభయంగా అప్పడాల తయారీకి పూనుకున్నాం. ఇప్పుడు మంచి లాభాల బాటలో ఉన్నాం. వినియోగదారుల నమ్మకమే మాకు కొండంత అండ. అవే మాకు ఆశీస్సులు.

సహకార వారోత్సవాలను విజయవంతం చేయాలి

గణేశ్‌నగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సహకార వారోత్సవాలను విజయవంతం చేయాలని ఉమ్మడి జిల్లా గొర్రెల, మేకల పెంపకందారుల సహకార యూనియన్ మాజీ డైరెక్టర్ కదారి అయిలన్న పిలుపునిచ్చారు. గురువారం కరీంనగర్‌లో ఆయన మాట్లాడుతూ 71వ భారత సహకార వారోత్సవాలు నవంబరు 14నుంచి 25వరకు జరిగే వారోత్సవాలలో సహకార జెండాలను ఆవిష్కరించాలన్నారు. 15న నూతన ఆవిష్కరణలు, సాంకేతిక సుపరిపాలనపై అవగాహన, 16న వ్యవస్థాపకత, ఉపాధి కల్పన నైపుణ్యాభివృద్ధిలో సహకార సంఘాల పాత్రపై అవగాహన కల్పించాలన్నారు. 17న సహకార సంస్థల వ్యాపార ప్రాయోజిత సంస్థలుగా రూపాంతరంపై, 18న సహకార సంఘాల మధ్య సహకారాన్ని పెంపొందించడంపై, 19న మహిళలు, యువతకు సహకారం అందించడంపై, 20న సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అవగాహన కల్పించాలన్నారు.

అమరుల త్యాగాలు చిరస్మరణీయం

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



వెంకటయ్య స్మారక స్థూపాన్ని ఆవిష్కరిస్తున్న చాడ వెంకట్‌రెడ్డి

చిగురుమామిడి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఉద్యమాల్లో పాల్గొని అమరులైన వారి త్యాగాలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి పోతారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని రేకొండలో ఇటీవల మృతి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు, తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న వ్యక్తి దుడ్డెల వెంకటయ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా స్మారక స్థూపాన్ని గురువారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. అవినీతి, అక్రమాల నిర్మూలన ఎర్ర జెండా పార్టీలతోనే సాధ్యం అవుతుందన్నారు. పేద ప్రజలకు అండగా ఉంటూ పోరాటాలు చేస్తున్న పార్టీలను అణిచి వేయాలని ఆలోచిస్తున్న వారికి ప్రజలే గుణపాఠం చెబుతారని అన్నారు. దుడ్డెల వెంకటయ్య కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాల ప్రకారం ఉద్యమాలు చేసిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వామ పక్ష పార్టీలను అణిచి వేయాలని చూస్తోందని అన్నారు. వాటిని కార్యకర్తలు, నాయకులు ఉద్యమాల ద్వారా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, చాకలి ఐలమ్మ మనుమరాలు చిట్యాల శ్వేత, రామచందర్, బోయిన అశోక్, గూడెం లక్ష్మి, బత్తుల బాబు, రాష్ట్ర జిల్లా కార్యవర్గ సభ్యులు, మండలాల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

- సర్వేకు ప్రజలు సహకరించాలి

సర్వేకు ప్రజలు సహకరించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని రేకొండలో గురువారం నిర్వహించిన కులగణన సర్వేలో చాడ వెంకటరెడ్డి కుటుంబీకుల వివరాలు సిబ్బంది నమోదు చేశారు. ప్రతీ కుటుంబం నమోదు చేసుకోవాలని సూచించారు.

క్రీడలతో స్నేహ సంబంధాలు

మానకొండూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో స్నేహ సంబంధాలు పెరుగుతాయని గురుకుల పాఠశాలల మల్టీ జోనల్ అధికారి కె అలివేలు అన్నారు. మండలంలోని దేవంపల్లిలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న పదో జోనల్ స్థాయి క్రీడలు గురువారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఆటగాళ్ల నైపుణ్యాన్ని వెలికితీసేందుకు కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల పరిధిలోని వారికి జోనల్ స్థాయి పోటీలను నిర్వహించిందని చెప్పారు. నాలుగు రోజుల పాటు వివిధ అంశాల క్రీడాకారులు తమ తమ నైపుణ్యాలను ప్రదర్శించి గెలుపొందడం సంతోషదాయకమన్నారు.. గెలుపొందిన క్రీడాకారులు డిసెంబరు మొదటి వారంలో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించే పోటీలలో సత్తాచాటాలని పిలుపునిచ్చారు. జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి ఉత్తములుగా ఎదగాలని సూచించారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి బియాబాని, ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు గోలి జగన్నాథం, లచ్చయ్య, కాళహస్తి, ఉదయ్‌కుమార్, శ్రీనివాస్ రెడ్డి, శ్యామలత, సతీష్ అశోక్‌బాబు, పీఈటీలు శివప్రసాద్, శేఖర్, అరుణ్, విక్రమ్‌లతో పాటు 1,190 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న జోనల్ అధికారి అలివేలు

కల్చరల్ మీట్‌తో విద్యార్థుల్లో స్నేహభావం



విజేతలకు మెమోంటో అందజేస్తున్న డీన్ సత్యనారాయణ

తంగళ్లపల్లి, నవంబర్ 14 (ఆంధ్రజ్యోతి): కల్చరల్ మీట్‌తో విద్యార్థుల్లో స్నేహభావం పెంపొందుతుందని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ జల్ల సత్యనారాయణ అన్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామంలోని జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కల్చరల్ మీట్ ముగింపు కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా 26 అంశాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మెమోంటోలను డీన్ సత్యనారాయణ అందజేశారు. ఈ సందర్భంగా డీన్ సత్యనారాయణ మాట్లాడుతూ మూడు రోజులుగా నిర్వహించిన కల్చరల్ మీట్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల నుంచి కల్చరల్ మీట్‌కు వచ్చిన విద్యార్థులు తమ ప్రతిభ చూపారని కొనియాడారు. ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల విద్యార్థులకు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీదేవి, యూనివర్సిటీ అబ్జార్వర్ డాక్టర్ త్రివేణి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రమేశ్, రాష్ట్రంలోని 11 కళాశాలలకు చెందిన 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

● **విజేతలుగా నిలిచిన విద్యార్థులు..**

మూడు రోజుల పాటు 26 అంశాలలో విద్యార్థులు ప్రతిభ చాటి విజేతలుగా నిలిచారు. రంగోలిలో జగిత్యాలకు చెందిన ఎ కావ్య, పెయింటింగ్‌లో అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలకు చెందిన రిశిత, పోస్టర్ మేకింగ్‌లో సైఫాబాద్ కళాశాల విద్యార్థి ఖుషీ, జగిత్యాల వ్యవసాయ కళాశాల ముగ్గురు విద్యార్థులు, కార్టునింగ్‌లో జె. వర్షషా, ఎస్సే రైటింగ్ ఇంగ్లీష్‌లో పి. రిశిత, ఎస్సే రైటింగ్ తెలుగులో తోర్నల కళాశాల విద్యార్థి ఎస్ సంతోష్ ప్రథమ స్థానంలో నిలిచారు. ఇంగ్లీషు డిబెట్‌లో సిరిసిల్ల కళాశాలకు చెందిన ఉమ నజం, ఆర్ నవ్య, తెలుగు డిబెట్‌లో హైదరాబాద్ కళాశాలకు చెందిన బి సాయిదీక్షిత, పి జయంతి, క్విజ్‌పోటీలో సిరిసిల్ల కళాశాలకు చెందిన సి సాయివెంకట్‌శివ, కె భార్గవరెడ్డి ప్రథమ స్థానాల్లో నిలిచారు. అలాగే గ్రూప్ సాంగ్‌లో అశ్వారావుపేట కళాశాల విద్యార్థి ఆర్ సాలోని, గ్రూప్, సోలో ఇన్‌స్ట్రుమెంటల్‌లో రాజేంద్రనగర్ కళాశాల విద్యార్థి టి వసంత్, క్లాసికల్ డ్యాన్స్‌లో అశ్వారావుపేట కళాశాల విద్యార్థి ఏ సాధిత్య, స్కిట్‌లో హైదరాబాద్ కళాశాల విద్యార్థి ఏ జీవన, గ్రూప్, సోలో ఫోక్ సాంగ్‌లో వరంగల్ కళాశాల విద్యార్థి సి రైమా, గ్రూప్ డ్యాన్స్ ఫోక్ సాంగ్‌లో అశ్వారావుపేట కళాశాల విద్యార్థి ఆదిత్య, గ్రూప్, మోనో యాక్టింగ్‌లో వరంగల్ కళాశాల విద్యార్థి ఎం భార్గవి, సోలో ఫోక్ డ్యాన్స్ అశ్వారావుపేట కళాశాల విద్యార్థి ఎం అఖిల మొదటి స్థానంలో నిలిచారు. అలాగే ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు మెమొంటోలతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు.

రైల్వే ట్రాక్ పునరుద్ధరణ

- సహాయం అందించిన సింగరేణి, ఎన్టీపీసీ సంస్థలు- 24 గంటల్లో ప్రారంభమైన రైళ్ల రాకపోకలు
- ఘటనపై విచారణకు త్రిసభ్య కమిటీ



పునరుద్ధరణ పనులు చేపడుతున్న సిబ్బంది



పెద్దపల్లి జిల్లా రాఘవాపూర్ వద్ద పట్టాలపై వెళుతున్న ప్యాసింజర్ రైలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పెద్దపల్లి జిల్లా రాఘవాపూర్, కన్నాల బోడగుట్ట సమీపంలో గూడ్స్ రైలు పట్టాలు తప్పిన ఘటనలో దెబ్బతిన్న ట్రాక్‌ను రైల్వే శాఖాధికారులు యుద్ధప్రాతిపదికన సింగరేణి, ఎన్టీపీసీ సంస్థల సహకారంతో 24 గంటల్లో పునరుద్ధరించారు. దీంతో ప్యాసింజర్ రైళ్ల రాకపోకలు గురువారం ప్రారంభం అయ్యాయి. రద్దు చేసిన పలు రైళ్లను ట్రాక్ ఎక్కిస్తున్నారు. ఘటనపై లోతుగా విచారణ జరిపేందుకు రైల్వే శాఖ త్రిసభ్య కమిటీని నియమించింది. మంగళవారం రాత్రి ఘజియాబాద్ నుంచి కాజీపేటకు ఐరన్ కాయిల్స్‌తో వెళుతుండగా ఈ ఘటన జరిగింది. 11 వ్యాగన్లు బోల్తా పడడంతో ఐరన్ కాయిల్స్ చెల్లాచెదురు కావడంతో మూడు లైన్ల ట్రాక్‌తో పాటు విద్యుత్ లైన్లు కొంత దూరం వరకు దెబ్బతిన్నాయి. ఢిల్లీ, చెన్నై, సికింద్రాబాద్ ప్రధాన లైన్ కావడంతో 60కి పైగా రైళ్ల రాకపోకలు రద్దయ్యాయి. పలు రైళ్లను పెద్దపల్లి, నిజామాబాద్ మీదుగా మళ్లించారు. ఘటన జరిగిన వెంటనే అప్రమత్తమైన దక్షిణ మధ్య రైల్వే శాఖాధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులను మొదలు పెట్టారు. జీఎం అరుణ్ కుమార్ జైన్, డివిజనల్ మేనేజర్ భరత్ కుమార్ జైన్ ఘటన స్థలానికి చేరుకుని పనుల్లో వేగం పెంచారు. పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కూడా సంఘటనా స్థలాన్ని పరిశీలించి సింగరేణి, ఎన్టీపీసీ సంస్థల సహాయాన్ని తీసుకుని జేసీబీలు, హిటా చీలను తెప్పించారు. 24 గంటల పాటు 3 జేసీబీలు, 10 హిటాచీలు, 3 క్రెయిన్లు, 3 హైడ్రా మిషన్లు, తది తర మిషన్లతో పాటు 1,200 మంది శ్రమించడంతో బుధవారం రాత్రి వరకు రెండు ట్రాక్‌లు అందుబాటులోకి వచ్చాయి. రెండు గూడ్స్ రైళ్లతో ట్రయల్‌రన్ నిర్వహించారు.

- మూడో లైన్ సైతం..

మూడో లైన్ కూడా గురువారం మధ్యాహ్నం వరకు అందుబాటులోకి రావడంతో ప్యాసింజర్ రైళ్లను అనుమ తించారు. బుధవారం రద్దు చేసిన పలు రైళ్లను రైల్వే శాఖాధికారులు పునరుద్ధరించారు. రైల్వే జీఎం, డీఎం ఇద్దరు ఇక్కడే ఉండి పలు సలహాలు, సూచనలు అందజేస్తూ పనులను వేగంగా పూర్తి చేయించారు. రామగుండంలో గల సింగరేణి, ఎన్టీపీసీ సంస్థలు మిషనరీతో పాటు మ్యాన్ పవర్ కల్పించకుంటే ట్రాక్ పునరుద్ధరణ పనులు మరింత ఆలస్యమయ్యేవి. ఇది దక్షిణ, ఉత్తర భారత దేశాన్ని కలిపే ప్రధాన లైన్ కావడం గమనార్హం. చెన్నై, సికింద్రాబాద్‌ల నుంచి ఢిల్లీకి నడిచే ప్రధాన రైల్వే లైన్, చెన్నై నుంచి వచ్చే రైళ్లు వరంగల్ మీదుగా, సికింద్రాబాద్ నుంచి వచ్చే రైళ్లు కాజీపేట మీదుగా పెద్దపల్లి, రామగుండం రైల్వే స్టేషన్ల మీదుగా వెళుతుంటాయి. ఈ లైన్ ఎప్పటికీ బిజీగా ఉంటుంది. గూడ్స్ రైలు ఇక్కడే బోల్తా పడడంతో పలు రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. హుటాహుటిన షెడ్యూల్ రైళ్లను రద్దు చేయడంతో ప్రయాణీకులు ఇబ్బందులు పడ్డారు. దూర ప్రయాణాలు చేసే వాళ్లు తమ ప్రయాణాన్ని వాయిదా వేసుకున్నారు. 24 గంటల్లో దెబ్బతిన్న ట్రాక్‌ను పునరుద్ధరించడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. శుక్రవారం నుంచి అన్ని ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్ రైళ్లు నడవనున్నాయి. ఈ ఘటనపై విచారణ జరిపేందుకు జీఎం అరుణ్ కుమార్‌తో పాటు మరో ఇద్దరు అధికారులతో త్రిసభ్య కమిటీని నియమించారు. ఈ కమిటీ లోతుగా విచారణ జరపనున్నది. గూడ్స్ రైలు ఓవర్ లోడ్‌తో ప్రయాణించడం వల్లనే సంఘటన జరిగిందా, రైల్వే ట్రాక్ కింది భాగంలోని నీళ్లు పోయి కుంగిపోవడం వల్ల జరిగిందా, ట్రాక్ నిర్వహణ లోపాల వల్ల జరిగిందా అనే అంశాలపై విచారణ జరిపి నివేదికను సీల్డ్ కవర్ రైల్వేశాఖ మంత్రికి పంపించనున్నారు. తద్వారా పలు చర్యలు తీసుకునే అవకాశాలున్నాయి.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

- పట్టు వస్త్రాలు సమర్పించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



స్వామివారికి పట్టు వస్త్రాలను తీసుకొస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రుద్రంగి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండల కేంద్రంలోని ప్రహ్లాద పర్వతంపై వెలిసిన లక్ష్మీనరసింహ స్వామి వారి కల్యాణోత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం నుంచే ఆలయ పరిసరాలు కోలాహలంగా మారాయి. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్-వనజ దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించగా ఆలయ కమిటీ చైర్మన్ కొమురె మంజుల, శంకర్ దంపతులు ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ప్రధానార్చకులు శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో ఉత్సవమూర్తుల విగ్రహాలను ఉంచి స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. రుద్రంగి గ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు, మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించారు. భక్తులు స్వామివారికి కట్న కానుకలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, మాజీ సర్పంచ్ తర్రే ప్రభలత మనోహర్, ఎర్రం గంగ నర్సయ్య గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, చెలకల తిరుపతి, సామ మోహన్‌రెడ్డి, కేసిరెడ్డి నర్సారెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు. కాగా ప్రహ్లాద పర్వతంపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవానికి ఆలయ చరిత్రలోనే తొలిసారిగా ప్రభుత్వ లాంఛనాలతో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు.

ధర్మపురిలో కార్తీక రద్దీ



ధర్మపురిలో గోదావరి హారతి ఇస్తున్న అర్చకులు

ధర్మపురి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో గురువారం కార్తీక మాస భక్తుల సంఖ్య పెరిగింది. కార్తీక మాసం సందర్భంగా క్షేత్రానికి భారీగా భక్తులు తరలి వచ్చారు. స్థానిక లక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ రామలింగేశ్వ స్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గోదావరి నదిలో భక్తులు కార్తీక స్నానాలు ఆచరించారు. నరసింహుని ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కళ్యాణం జరిపించి పూజలు చేశారు. స్వామి వారలకు ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి పదమూడవ రోజు గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు గోదావరి మాతకు ప్రత్యేక పూజలు చేసి హారతి కార్యక్రమం నిర్వహించారు.

కోటిలింగాలలో..

వెల్గటూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలం లోని కోటిలింగాలలో గురువారం వైకుంఠ చతుర్దశి సందర్భంగా కార్తీక సందడి నెలకొన్నది. తెల్లవారి శుక్రవారం కార్తీక పూర్ణిమ కావడంతో భక్తులు అధిక సంఖ్యలో గోదావరి స్నానాలు ఆచరించారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి గోదావరిలో వదిలారు. అనంతరం పార్వతీ కోటేశ్వర స్వామిని దర్శించుకొని అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం శివ నామ స్మరణతో మారుమోగింది. కాగా కార్తీక పూర్ణిమకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండడంతో భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో కాంతారెడ్డి తెలిపారు.

ధర్మపురిలో వైభవంగా తులసీ కల్యాణం



తులసీ కల్యాణం నిర్వహ స్తున్న అర్చకులు

ధర్మపురి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో తులసీ కల్యాణోత్సవం గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయ అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంపత్‌కుమార్ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య వేణుగోపాల స్వామి ఆలయం నుంచి అర్చకులు ఉత్సవ మూర్తులను శేషప్ప కళావేదికపై తీసుక వచ్చారు. అనంతరం అందంగా పూలతో అలంకరించిన రుక్మిణి, సత్యభామ సహిత వేణుగోపాల స్వామి వారలకు ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కల్యాణం చేయించారు. కల్యాణోత్సవాన్ని తిలకించిన భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ వావిలాల తిరుపతి, పాల్గొన్నారు.

కన్నుల పండువగా వేంకటేశ్వర స్వామి తెప్పోత్సవం



స్వామివారి తెప్పోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

కోరుట్ల రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపూర్ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం తెప్పోత్సవం వేడుకలు గ్రామస్థుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆలయంలో కుంకుమార్చన కార్యక్రమం జరుగగా అధిక సంఖ్యలో మహిళలు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు వెంకటరమణ నిత్య హోమం జరిపారు. ప్రత్యేకంగా అలంకరించిన అలివేలు మంగ లక్ష్మిపద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను గ్రామ శివారులోని చెరువులో తెప్పోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగతల్లికి ప్రత్యేక పూజలను జరిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తోట శారద - లింగారెడ్డి, మాజీ ఎంపీపీ తోట నారాయణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ బోయినిపల్లి సత్యం రావు, దేవాలయ చైర్మన్ కట్కం రాజేశ్, గ్రామస్థులు గంగలక్ష్మి - నర్సయ్య, గంద్ర గోపాల్ రావు పాల్గొన్నారు.

'తక్షణమే ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి'

సుభాష్‌నగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తక్షణమే ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాలల ఒత్తిడికి తలొగ్గి ఎస్సీ వర్గీకరణ అమలును జాప్యం చేస్తున్నాడని ఆయన ఆరోపించారు. గురువారం నగరంలో ఉమ్మడి జిల్లా ఎంఆర్‌పీఎస్ అనుబంధ సంఘాలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్, ఇంజం వెంకటస్వామి, రుద్రరాపు రామ చందర్, ఆవునూరి ప్రభాకర్ పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

కరీంనగర్ కల్చరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీసీ వెల్ఫేర్ స్కూల్స్ సంయుక్త కార్యదర్శి జీవీ శ్యాంప్రసాద్‌లాల్ జన్మదినం సందర్భంగా గురువారం నగరంలోని శ్రీటైల్స్ గెస్ట్ హౌజ్‌లో ఎస్సీ ఫ్రెండ్స్, బడి సోపతులు, డిగ్రీ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో శ్యాం.. నిరంతర స్నేహ వసంతం టైటిల్‌తో స్నేహితుడు పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నంది శ్రీనివాస్, అన్నవరం దేవేందర్, గోనె శ్రీనివాస్, వేములవాడ ఆర్‌డీఓ రాజేశ్వర్, కామారపు అశోక్‌కుమార్, జోగినపల్లి శరత్‌చంద్ర పాల్గొన్నారు.

ఆలయ కమిటీలో చోటు కల్పించాలి

గణేశ్‌నగర్: ఆలయ కమిటీలలో విధిగా ఒక నాయీబ్రాహ్మణ సభ్యుడు ఉండే విధిగా ప్రత్యేక జీవో ఇవ్వాలని తెలంగాణ నాయీ బ్రాహ్మణ ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుంజపడుగు హరిప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం నగరంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

సుభాష్‌నగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వాగ్దేవి క్లబ్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన జన్మదిన వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు మాడిశెట్టి ఉమాదేవి, మాడిశెట్టి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

సుభాష్‌నగర్, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ రెడ్‌క్రాస్ సొసైటీ కరీంనగర్ సెంటర్ ఆధ్వర్యంలో ఎన్ఆర్‌ఐ కట్ట శ్రావణి కిరణ్‌కుమార్ జన్మదినం సందర్భంగా గురువారం జ్యోతినగర్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి రాధాకృష్ణారెడ్డి, బ్లడ్ డొనేషన్ ఆర్గనైజర్ వెంకటేష్, డాక్టర్ మహేశ్, కార్పొరేటర్ రాపర్తి విజయ పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

కరీంనగర్ కల్చరల్/కరీంనగర్ టౌన్/భగత్‌నగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని గురువారం నగరంలోని వివిధ విద్యాసంస్థల్లో బాలల దినోత్సవం నిర్వహించారు. భగత్‌నగర్ అద్వితి ఇంటర్నేషనల్ స్కూల్లో వేడుకల్లో డైరెక్టర్ అనుదీప్ సోగాని పాల్గొన్నారు. మంకమ్మతోట, భగత్‌నగర్, విద్యానగర్ సిద్ధార్థ విద్యాసంస్థల్లో జరిగిన కార్యక్రమంలో చైర్మన్ దాసరి శ్రీపాల్‌రెడ్డి పాల్గొన్నారు. వావిలాలపల్లిలోని విద్యాధరి ఉన్నత పాఠశాలలో చైర్మన్ జువ్వాడి వేంకటేశ్వరరావు, డైరెక్టర్ జువ్వాడి మౌనిక హరిచరణ్‌రావు పాల్గొన్నారు. పారమిత విద్యాసంస్థలు, ఎక్స్‌ప్లోరికా, హెరిటేజ్ పాఠశాలల్లో జరిగిన వేడుకల్లో చైర్మన్ డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు పాల్గొన్నారు. భగత్‌నగర్ అల్ఫోర్స్ ఈ టెక్నో, వావిలాలపల్లి అల్ఫోర్స్ టైనీ టాట్స్, అల్ఫోర్స్ ప్రైమరీ, హైస్కూల్, గర్ల్స్ హైస్కూల్, కొత్తపల్లి ఈ టెక్నో పాఠశాలలో జరిగిన వేడుకల్లో చైర్మన్ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. రావూస్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో చైర్మన్ ప్రభాకర్‌రావు, సీఈఓ నితీన్‌రావు, ప్రిన్సిపల్ రెహమాన్ పాల్గొన్నారు. వావిలాలపల్లి సెయింట్‌పాల్స్ స్కూల్లో చైర్మన్ ఎం రాజ్‌కుమార్, ప్రిన్సిపల్ లీనా ప్రియదర్శిని పాల్గొన్నారు. హౌజింగ్ బోర్డు కాలని మారుతినగర్‌లోని రిషి ద ప్లే స్కూల్లో చైర్మన్ కె చెన్నప్ప పాల్గొన్నారు. మానేరు విద్యా సంస్థలో చైర్మన్ కడారి అనంతరెడ్డి, డైరెక్టర్ కడారి సునీతారెడ్డి పాల్గొన్నారు. కోతిరాంపూర్‌లోని అచీవర్స్ యాక్టివ్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పల్లవి, డైరెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. నగరంలోని ప్యారడైజ్, సెయింట్‌జార్జ్ పాఠశాలల్లో



వేడుకల్లో చిన్నారులతో అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

నిర్వహించిన కార్యక్రమంలో చైర్మన్ ఫాతిమారెడ్డి, వైద్యురాలు సంగీత, అకాడమిక్ సీఈఓ ఉమాకాంత్, ప్రిన్సిపాల్ వసంత, భార్గవ్, నిరంజన్ పాల్గొన్నారు.

●హుజూరాబాద్:హుజూరాబాద్ పట్టణంలోని ఏకశిల, మాంటిస్సోరి, కేరళ ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో బాలల దినోత్సవం నిర్వహించారు. గంగిశెట్టి మధుకమ్మ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు ట్రస్టు నిర్వాహకుడు జగదీశ్వర్ పెన్నులను పంపిణీ చేశారు.

●హుజూరాబాద్ పట్టణంలోని అల్ఫోర్స్ జీనియస్ స్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో చైర్మన్ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

●గంగాధర: మండలంలో బాలల దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు.

●శంకరపట్నం: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మొలంగూర్ పాఠ



విద్యార్థులతో సెయింట్‌జార్జ్ చైర్మన్ ఫాతిమారెడ్డి

శాలలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు.

●వీణవంక: మండల వ్యాప్తంగా బాలల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో సుద్దాల శోభారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●ఇల్లందకుంట: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

●చిగురుమామిడి: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బాలల దినోత్సవం నిర్వహించారు.

●సైదాపూర్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

●చొప్పదండి: మండలంలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. రుక్మపూర్ మోడల్‌స్కూల్‌లో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు.

●జమ్మికుంట: పట్టణంలోని సెయింట్ జోసఫ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కరస్పాండెంట్ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

సుభాష్‌నగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఐకేపీ, పీఏసీఎస్, డీసీఎంఎస్ హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య డిమాండ్ చేశారు. గురువారం జిల్లా ఐకేపీ కో ఆపరేటీవ్ సొసైటీ సెంటర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట దర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఐకేపీ, పీఏసీఎస్, డీసీఎంఎస్‌ల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నారని అన్నారు. ఆయా సెంటర్లలో పని చేస్తున్న హమాలీ కార్మికులు, సాటసడెం చేస్తున్న మహిళ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైం దన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ట్రాక్టర్, లారీ లోడ్ అయిన తరువాత తాడు కట్టుటకు కూలీ ఒక టన్నుకు రూ.60 చెల్లించాలని, పనిచేస్తున్న సమయంలో



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న హమాలీ కార్మికులు

ప్రమాదం జరిగితే ప్రభుత్వం ప్రమాద బీమా కల్పించాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీ రేట్లు పెంచి క్వింటాలుకు రూ.80 ఇవ్వాలని కోరారు. ధర్నాలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య, జిల్లా ఐకేపీ కో-ఆపరేటీవ్ సొసైటీ సెంటర్ హమాలీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నెల్లి రాజేశం, ప్రధానకార్యదర్శి కటికరెడ్డి బుచ్చన్న, ఉపాధ్యక్షులు జంగం లింగయ్య, పిట్టల సమ్మయ్య, పిట్టల శ్రీనివాస్, నెల్లి రవీందర్ పాల్గొన్నారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడిపై కేసు

కరీంనగర్ క్రైం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కిసాన్ నగర్‌లో అక్రమంగా మద్యం అమ్మకాలు సాగిస్తున్న బెల్ట్‌షాపు నిర్వాహకుడిపై గురువారం కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. కిసాన్‌నగర్‌కు చెందిన మహేష్ అనే వ్యక్తి బెల్టు షాపు నడుపుతుండగా త్రీటౌన్ ఎస్సై చేరాలు సిబ్బందితో దాడి చేసి 27,110 రూపాయల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మహేష్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కలెక్టర్‌కు కృతజ్ఞతలు

కరీంనగర్ కల్చరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కళాభారతి పునరుద్ధరణ కోసం కృషి చేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతికి తెలంగాణ రంగస్థల సాంస్కృతిక కళాకారుల అసోసియేషన్ ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపింది. కృతజ్ఞతలు తెలిపిన వారిలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వంగ సుధాకర్, అలివేలు సమ్మిరెడ్డి, కోశాధికారి నల్లగోని రమేశ్‌గౌడ్, సహాయకార్యదర్శులు రామచంద్రారెడ్డి, పరశురాములు డైరెక్టర్లు మాడ రాజిరెడ్డి, కాంతాల రాజిరెడ్డి, నల్లగోని తిరుపతిగౌడ్, మన్నెంపల్లి శంకర్, పరశురాములు వివిధ మండలాల అధ్యక్షులు పిట్టల సంపత్, లడే సంపత్‌రావు, దొంగల రాజయ్య, శ్రీరామోజు రాజ్‌కుమార్, కోడూరి తిరుపతి, కోడూరి రవీందర్, పడాల శ్రీనివాస్‌గౌడ్ తదితరులున్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

కరీంనగర్ రూరల్, నవంబర్14(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఆర్ఆర్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల లైబ్రరియన్ కృష్ణారెడ్డి అన్నారు. గురువారం కరీంనగర్ మండలం నగునూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాలను లలితాశర్మ ప్రారం భించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాలతి పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడి పర్యటనను విజయవంతం చేయాలి

కరీంనగర్ అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ పర్యటించనున్నారని, కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కాంగ్రెస్‌పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. డీసీసీ కార్యాలయంలో ఉదయ 10 గంటలకు జరిగే సమావేశానికి పార్టీ శ్రేణులు హాజరుకావాలన్నారు.

గ్రూప్-3 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు: అదనపు కలెక్టర్

కరీంనగర్ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-3 పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం నిర్వహించనున్న గ్రూప్-3 పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు, ఇతర మెటీరియల్‌ను కట్టుదిట్టమైన బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరి చామన్నారు. జిల్లాలో గ్రూప్-3 పరీక్షను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.

'త్వరలోనే నెహ్రూ కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తాం'



నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నవరన్‌స్ట్రీట్‌లో త్వరలోనే నెహ్రూ కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తామని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి తెలిపారు. నవరన్‌స్ట్రీట్‌లో జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్, ఎస్టీ సెల్ అధ్యక్షులు ఎండి తాజ్, శ్రవణ్ నాయక్, కార్పొరేటర్లు సరిళ్ల ప్రసాద్, ఆర్ష మల్లేశం, బుచ్చిరెడ్డి, పిట్టల శ్రీనివాస్, గంట కల్యాణిశ్రీనివాస్ పాల్గొన్నారు.

●డీసీసీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకలకు సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ తాజ్, గడ్డం విలాస్‌రెడ్డి, దన్నా సింగ్ పాల్గొన్నారు.

శిశుమందిర్ పాఠశాలకు లక్ష రూపాయల విరాళం

కరీంనగర్ టౌన్, నవంబరు 14: నగరంలో శ్రీసరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మిస్తున్న భవనానికి ప్రముఖ వ్యాపారవేత్త, ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధి కక్కిరాల రమేశ్ లక్ష రూపాయల విరాళాన్ని విద్యాపీఠం ప్రతినిధులకు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు కరుణాకర్‌రావు, కార్యదర్శి ఇంజనీర్ కోల అన్నారెడ్డి, సమితి అధ్యక్షుడు డాక్టర్ రమణాచారి, కార్యదర్శి ఎలగందుల సత్యనారాయణ తెలిపారు.

'మనోవికాసాన్ని పెంచే చిత్రాలు రావాలి'

కరీంనగర్ కల్చరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల మనోవికాసాన్ని పెంపొందించే చిత్రాలు రావాలని కరీంనగర్ ఫిలిం సొసైటీ అధ్యక్షుడు, సినీ రంగ విమర్శకుడు డాక్టర్ పొన్నం రవిచంద్ర అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా ఫిలింభవన్‌లో బాలల చలన చిత్రోత్సవాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. గురువారం బాల శివాజీ చిత్రం ప్రదర్శించగా శుక్ర, శని వారాల్లో సాయంత్రం 6 గంటల నుంచి దిల్లర్ బచ్చే, అభయం సినిమాలను ప్రదర్శిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కఫిసొ ప్రధాన కార్యదర్శి లక్ష్మీగౌతమ్, ఉపాధ్యక్షుడు సయ్యద్ ముజాఫర్ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో వివేకానంద విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ పరిధిలో ఈనెల 13న నిర్వహించిన అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీల్లో స్థానిక వివేకానంద విద్యార్థులు క్రాస్ కంట్రీ 12.5 కిలోమీటర్లలో పసిడి పతకాన్ని ఎం వినయ్, 10 కిలోమీటర్లలో పసిడి పతకం, ఎం శ్యాంకుమార్ 5 కిలోమీటర్ల పరుగుపందెంలో పసిడి పతకం, 1500 మీటర్లలో ఎం వినయ్ పసిడి పతకం, 100 మీటర్ల పరుగు పందెంలో కె శ్రీజ బ్రాంజ్ మెడల్, షాట్‌పుట్‌లో పి నగేష్ పసిడి పతకం, జావెలిన్‌త్రోలో విష్ణు బ్రాంజ్ మెడల్ సాధించినట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ పన్యాల శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులను కరస్పాండెంట్ ఆగంరావు, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అభినందించారు.

'కార్తిక పౌర్ణమి రోజు కుల గణన సర్వే చేయొద్దు'

భగత్‌నగర్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి రోజు ప్రభుత్వం కుల గణన సర్వేన విరమించుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. హిందువులు పవిత్రంగా భావించే కార్తీక మాసం కార్తీక పౌర్ణమి రోజున కులగణన సర్వే చేపట్టమనడం సరికాదన్నారు.

నేడు సత్యనారాయణస్వామి వ్రతాలు

కరీంనగర్ కల్చరల్, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): యజ్ఞవరాహక్షేత్రంలో శుక్రవారం సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహిస్తున్నట్లు సర్వవైదిక సంస్థానం ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాదశర్మ తెలిపారు.

●అశోక్‌నగర్ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఉదయం 10 గంటల నుంచి సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహిస్తున్నామని, దంపతులు ఎలాంటి రుసుము చెల్లించనవసరం లేదని చైర్మన్ చిట్టుమల్ల శ్రీనివాస్ పేర్కొన్నారు.

'నగరానికి నూతన మాస్టర్‌ప్లాన్'



మాస్టర్ ప్లాన్‌ను పరిశీలిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకొని 30 ఏళ్ళ వరకు ఉపయోగపడేలా అద్భుతమైన కరీంనగర్ నూతన మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తున్నామని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. దీనితో భవన నిర్మాణ అనుమతులు సులభతరం కావడమేకాకుండా ఇళ్ళు కట్టుకునే వారికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని మేయర్ అన్నారు. బుధవారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో తయారు చేసిన మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్ మ్యాప్‌ను ఆయన చాంబర్‌లో పరిశీలించి, టౌన్‌ప్లానింగ్ అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థలో విలీనమైన ఎనిమిది గ్రామాలతో కలిపి ప్రస్తుత 60డివిజన్లతో మాస్టర్‌ప్లాన్‌ను రూపొందిస్తున్నామని చెప్పారు. త్వరలోనే ఈ నూతన మాస్టర్‌ప్లాన్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్ మ్యాప్‌పై సలహాలు, సూచనలను తీసుకుంటామని చెప్పారు. ఆ తర్వాత కౌన్సిల్ ఆమోదం తీసుకొని ప్రభుత్వానికి పంపిస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ అధికారి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

మధుమేహాన్ని నియంత్రణలో ఉంచుకోవాలి

సుభాష్‌నగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మధుమేహాన్ని నియంత్రణలో ఉంచుకోవాలని ఫిజీషియన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా కరీంనగర్ శాఖ చైర్మన్ డాక్టర్ విజయ్‌మోహన్‌రెడ్డి, డాక్టర్ రఘురామన్, డాక్టర్ డీసీ తిరుపతిరావు తెలిపారు. గురువారం నగరంలోని ప్రతిమ హోటల్‌లో వరల్డ్ డయాబెటిస్ డే సందర్భంగా విలేకరుల సమావేశంలో వారు పలు వివరాలను తెలియచేశారు. డయాబెటీస్ వల్ల దీర్ఘకాలిక జబ్బులు వస్తాయన్నారు. సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ వెంకటేశ్వర్లు, కోశాధికారి డాక్టర్ పి చైతన్యరెడ్డి, ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ నవీన్,ఐఎంఏ మాజీ కార్యదర్శి డాక్టర్ వెంకటరెడ్డి, డాక్టర్ సురేష్, డాక్టర్ వడ్డేబోయిన లక్ష్మన్, డాక్టర్ శేషశైలజ, డాక్టర్ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

సుభాష్‌నగర్: వరల్డ్ డయాబెటిస్ డే సందర్భంగా సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ రఘురామన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం సక్రమంగా మందులు వాడుతూ దయా బెటిక్‌ను అదుపులో ఉంచుకున్న పలువురు డయాబెటిక్ పేషంట్లకు డాక్టర్ రఘురామన్ ప్రోత్సాహక బహుమతులను అందచేశారు.



మహిళకు బహుమతి అందజేస్తున్న డాక్టర్ రఘురామన్

● కరీంనగర్ లీగల్: కోర్టు ఆవరణలో నగరంలోని మెడికవర్ ఆసుపత్రి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి ప్రతిమ ప్రారంభించారు. ఆసుపత్రి సెంటర్ హెడ్ నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి డి వెంకటేష్, ఏసీబీ కోర్టు న్యాయమూర్తి కుమార్ వివేక్, ఫ్యామిలి కోర్టు న్యాయమూర్తి పి లక్ష్మికుమారి, జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జీ కె వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

● రామడుగు : మధుమేహ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని లయన్స్ క్లబ్ సభ్యులు సూచించారు. గోపాల్‌రావుపేట గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ మధుమేహ దినం సందర్భంగా గ్రామంలోని ప్రజలకు షుగర్ పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కర్ర ప్రభాకర్‌రెడ్డి, సెక్రటరీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

హుజూరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న అడబాల రాజీ అనే విద్యార్థి బుధవారం కరీంనగర్‌లోని శాతవాహన విశ్వవిద్యాలయంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. షాట్‌పుట్ ఈవెంట్లో రాజీ ప్రథమ స్థానం సాధించి స్వర్ణపతకం సాధించాడు. త్వరలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో శాతవాహన విశ్వవిద్యా లయం తరుపున ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా రాజీని కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరాదేవి, క్రీడా సమన్వయకర్త మంగమ్మ, వైస్ ప్రిన్సిపాల్ మల్లారెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

గాలిపెల్లి కుమార్‌కు పురస్కారం

కరీంనగర్ రూరల్, నవంబర్14(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామానికి చెందిన గాలిపల్లి కుమార్‌కు అన్నమయ్య జిల్లా రాయచోటిలోని పీసీఆర్ ఫంక్షన్ హాల్ గ్రౌండ్‌లో బాలల దినోత్సవం సందర్భంగా సోమల్ రాజ్ ఫౌండేషన్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టర్ శ్రీధర్ చామకుమారి ఫౌండేషన్ చైర్మన్ శిరాజ్ చేతుల మీదుగా భారత సేవా పురస్కారాన్ని అందుకున్నారు. రక్త దానంతో పాటు రక్తదాతలకు సహకరిస్తున్న కుమార్‌కు ఈ అవార్డును అందజేశారు.

టీడీపీకి పూర్వ వైభవం తీసుకురావాలి

- పార్టీ మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి దామెర సత్యం

గన్నేరువరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తీసుకరావాలని పార్టీ మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పార్లమెంట్ అడహక్ కమిటీ సభ్యుడు దామెర సత్యం అన్నారు. మండలంలోని గుండ్లపల్లిలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానకొండూరు నియోజకవర్గంలో అత్యధిక సభ్యత్వాలను నమోదు చేయాలని పిలుపునిచ్చారు. సభ్యత్వం తీసుకున్న ప్రతీ కార్యకర్తకు ఐదు లక్షల జీవిత బీమా కల్పిస్తున్న ఏకైక పార్టీ తెలుగుదేశం అని కొనియాడారు. ప్రజా సమస్యలపై పోరాడుతూ పార్టీని పటిష్ఠం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు బోలుమల్ల సదానందం, మండల అడహక్ కమిటీ కన్వీనర్ గుండా పర్శరాం, నాయకులు రాజయ్య, మల్లయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న దామెర సత్యం

సిర్సపల్లిలో న్యాయవిజ్ఞాన సదస్సు

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిర్సపల్లి గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జడ్జి కిరణ్‌కుమార్ వివిధ చట్టాలపై, అవగాహన కల్పించారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. చట్టాలపై అవగాహన ఉంటే నేరాలు జరుగవని తెలిపారు. కార్యక్ర మంలో ఏఎస్ఐ కమల, ఇన్‌చార్జీ హెచ్ఎం మల్లేషం పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఇద్దరికి జరిమానా

శంకరపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన ఇద్దరికి జరిమానా విధించినట్లు కేశవపట్నం ఎస్సై కొత్తపల్లి రవి తెలిపారు డ్రంకెన్‌డ్రై వ్‌లో ఇద్దరు పట్టుబడగా వారిని హుజూరా బాద్ కోర్టు సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఈశ్వరయ్య ఎదుట హాజరు పరుచగా రెండు వేలు జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్ట ప్రకారం చర్యలు ఉంటామని తెలిపారు.

నెహ్రూకు ఘన నివాళి

చొప్పదండి, నవంబరు14: (ఆంధ్రజ్యోతి) చొప్పదండిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దేశ మొదటి ప్రధాని స్వర్గీయ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నిజనపురం చందు, మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్, నాయకులు పేరుమాండ్ల గంగయ్య గౌడ్ ,ముద్దం తిరుపతి, వొల్లల క్రిష్ణహరి, గుర్రం రమేష్, గుర్రం రాజేందర్ రెడ్డి, మునిగల సుధాకర్, మావురపు రాములు, మునిగాల చందు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ

మానకొండూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 27 గ్రామపంచాయతీలకు సంబంధించిన పనుల వివరాలను చదివి వినిపించారు. ఇందులో ఆయా గ్రామాల్లో రూ. 75వేల నిధులు దుర్వినియోగం అయినట్లు సామాజిక తనిఖీలో వెల్లడైంది. వాటిని క్షేత్ర సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్, పంచాయతీ కార్యదర్శులు, సాంకేతిక సహాయకులు ద్వారా రికవరీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో పీడీ శ్రీధర్, ఏపీడీ కృష్ణ, విజిలెన్స్ అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి, నాణ్యత నియంత్రణ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారానికి పోరాడాలి'

చిగురుమామిడి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కారానికి పోరాడాలని కల్లు గీత కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపెల్లి తిరుపతిగౌడ్ అన్నారు. మండల కేంద్రంలో హమాలీ యూనియన్ సంఘం కార్యాలయాంలో గురువారం మండల ప్రజా సంఘాల సమావేశం సీఐటీయూ జిల్లా కార్యదర్శి మారెల్ల శ్రీలత అధ్యక్షతన నిర్వహిం చారు. ఈ సంద ర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వర్ణవెంకటరెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో కమిటీలు పూర్తి చేసి ప్రజా పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పోరాటాలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు

తిమ్మాపూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన, వికాస నిలయాలుగా విరాజిల్లుతున్నాయని, ఈ కేంద్రాలను పాఠకులు వినియోగించుకోవాలని గ్రంథాలయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ముదుగంటి సుధాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎల్ఎండీ కాలనీలోని జిల్లా విద్యా శిక్షణా సంస్థ(డైట్)లో గురువారం నిర్వహించిన జాతీయ గ్రంథాలయ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగులు, విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య, అధ్యాపకులు కె శంకర్, రహమాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముదుగంటి సుధాకర్‌రెడ్డి

వీణవంక: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రాజిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సర్వతో ముఖాభివృద్ధి చెందడానికి గ్రంథాలయాల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ పాలకుడు రామ్మోహన్, అధ్యాపకులు భాస్కర్, శోభన్‌బాబు, రవీందర్, జైపాల్‌రెడ్డి, కల్పన, శైలజ, సుమతల, జమీల్ పాల్గొన్నారు.

డైరెక్టర్లకు సన్మానం

వీణవంక, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వీణవంక మండలంలో నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లు కామిడి శ్రీపతిరెడ్డి, మాదాసి సునీల్, నల్లగోని సతీష్, ఎండీ రషీద్‌పాషాలను కొమ్మిడి రాకేష్‌రెడ్డి గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మేకల ఎల్లారెడ్డి, నల్ల కొండాల్‌రెడ్డి, పోతరవేన సతీష్‌కుమార్, విద్యాసాగర్, గట్టయ్య, రాజగోపాల్, కుమార్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

ఇల్లందకుంట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూజూనూర్ గ్రామానికి చెందిన దుండ్ర లత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా గురువారం మాజీ ఎంపీపీ సరిగొమ్ముల పావని-వెంకటేష్ పరామర్శించి ఐదు వేల రూపాయలల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ జగన్, మాజీ ఉపసర్పంచ్ మల్లయ్య, గజ్జి కుమార్, అయిలయ్య, చంద్రయ్య, సాంబయ్య, విజయ్, కిరణ్, కుమార్, ఓదెలు, అనిల్, రఘు, కుమార్ పాల్గొన్నారు.

అంబేద్కర్ స్ఫూర్తితో సేవ

హుజూరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జ్యోతిబాపూలే, కుమరంభీం డాక్టర్ జ్యోతిబాపూలే, అబ్దుల్ కలాం స్ఫూర్తితో పని చేస్తామని తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి అందె వెంకటేశ్వరరావు అన్నారు.

పట్టణానికి చెందిన న్యాయవాది అందె వెంకటేశ్వరరావు ఆలిండియా తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొత్త విజయ భాస్కర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశా రు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సేవ చేస్తానని చెప్పారు. తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

భగత్‌నగర్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ద్వారా మంజూరైన చెక్కులను గురువారం చింతకుంట గ్రామంలో కొత్తపల్లి మాజీ వైస్ ఎంపీపీ భూక్యతి తిరుపతి నాయక్ పంపిణీ చేశారు. చింతకుంటలో దొనపాటి అనసూయకు రైతు సంఘం అధ్యక్షుడు న్యాలమడుగు శంకరయ్యతో కలిసి అందించారు.